నమస్తే తెలంగాణ
DISTRICT SUPPLEMENT
# వికారాబాద్
శనివారం 7 అక్టోబర్ 2023
SATURDAY, OCTOBER 7, 2023
VIKARABAD
పేజీలు : 12
PAGES



రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఇడ్లీ తినిపిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి

# బెంచి వద్దకే బ్రేక్‌ఫాస్ట్

లోపలి పేజీల్లో..

# ఆకలికి సెలవిక..



తాండూరులో విద్యార్థులతో కలిసి టిఫిన్ చేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

**విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ : ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు**

**సీఎం కేసీఆర్ అమలు చేసే ప్రతి పథకమూ సూపర్ హిట్ : విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి**

**రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో 'సీఎం అల్పాహారం' ప్రారంభించిన మంత్రులు**

**వికారాబాద్‌లోని శివారెడ్డిపేట జడ్పీహెచ్‌ఎస్‌లో మంత్రి మహేందర్‌రెడ్డి, ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు శ్రీకారం..**

### కేసీఆర్ సార్‌కు కృతజ్ఞతలు..

ఇప్పటికే ప్రతి విద్యార్థికీ మధ్యాహ్న భోజనం అందిస్తున్న ప్రభుత్వం ఉదయం సమయంలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పేరుతో టిఫిన్ అందించడం ఎంతో గొప్ప విషయం. ఉదయం వేళలో కనీసం టిఫిన్ చేయకుండానే పాఠశాలకు వస్తుంటాం. ఇలాంటి సమయంలో పాఠశాలలో టిఫిన్ అందించడం మాకు ఎంతో మేలు జరుగుతుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ సార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

- సౌమ్య, 9వ తరగతి, దండుమైలారం, ఇబ్రహీంపట్నంరూరల్



తాండూరులో పూరి తింటున్న విద్యార్థిని



రావిర్యాల ఉన్నత పాఠశాల టిఫిన్ చేస్తున్న విద్యార్థులు





**ముఖ్యమంత్రి** అల్పాహార పథకం విద్యార్థులకు గొప్ప వరమని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని రావిర్యాల ఉన్నత పాఠశాల 'సీఎం అల్పాహారం' పథకాన్ని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ మానవతా దృక్పథంతో విద్యార్థులకు అల్పాహారాన్ని అందిస్తున్నారన్నారు. ఇది కేవలం విద్యార్థుల కడుపు నింపే కార్యక్రమం మాత్రమే కాదని, డ్రాపౌట్స్ తగ్గించి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పు తెచ్చే పథకమన్నారు. పదోతరగతి విద్యార్థుల వరకు బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. దసరా తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్కూళ్లలో ఈ పథకం అమలవుతుందన్నారు. సీఎం కేసీఆర్ ఏ పథకాన్ని అమలు చేసినా ప్రజా కోణంలో ఆలోచిస్తారని, అందుకే అన్ని పథకాలు విజయవంతమవుతున్నాయన్నారు. విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ ఈ పథకంతో రాష్ట్రవ్యాప్తంగా 23లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. చాలామంది విద్యార్థులు పస్తులతోనే పాఠశాలలకు వస్తున్నారని, దీన్ని గమనించిన సీఎం కేసీఆర్ బ్రేక్ ఫాస్ట్ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. అల్పాహారం నాణ్యతను పరిశీలించేందుకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు పాఠశాలలను తనిఖీలు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు విద్యార్థుల పక్కనే కూర్చుని అల్పాహారం తిన్నారు. మంత్రులు స్వయంగా విద్యార్థులకు టిఫిన్‌ను తినిపించడం చూపరులను ఆకట్టుకున్నది.

-న్యూస్‌నెట్‌వర్క్, (నమస్తే తెలంగాణ)

## తాండూరుకు అదనపు న్యాయస్థానం

తాండూరు, అక్టోబర్ 6 : తాండూరుకు అదనపు న్యాయస్థానాన్ని మంజూరు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం జీవో నంబర్ 60ను జారీ చేసింది. ప్రస్తుతమున్న జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయస్థానాన్ని ఉన్నతీకరించి ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్‌గా మార్చారు. అదే సమయంలో తాండూరుకు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయస్థానాన్ని మంజూరు చేశారు. దీన్ని మున్సిఫ్ కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సహకారంతో తాండూరుకు అదనపు న్యాయస్థానం మంజూరు కావడంతో తాండూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌తో పాటు న్యాయవాదులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.



## నేడు కడ్తాల్ పోలీస్‌స్టేషన్ ప్రారంభం

**ముఖ్యఅతిథులుగా హాజరుకానున్న మంత్రులు మహమూద్‌అలీ, సబితారెడ్డి**

కడ్తాల్, అక్టోబర్ 6 : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. శనివారం హోంమంత్రి మహమూద్‌అలీ, విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు. 30 గుంటల విస్తీర్ణంలో రూ.1.50 కోట్లతో నిర్మించిన ఈ భవనంలో విశాలమైన గదులున్నాయి. సీఐ, ఎస్‌ఐ, రైటర్లు, సిబ్బందికి ప్రత్యేక గదులు, రికార్డుల రూంలు, రిసెప్షన్, కంప్యూటర్, విశ్రాంతి, వెయిటింగ్ గదులు, సువిశాలమైన పార్కింగ్ సౌకర్యం ఉన్నది. ఈ కార్యక్రమానికి ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, డీజీపీ అంజనీకుమార్, సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్‌రవీంద్ర, డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ రంగస్వామి హాజరుకానున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.